01ATP29_01ATP29.qxd 29-09-2026 PM 10:25 Page 1



అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
బుధవారం 30 సెప్టెంబర్ 2026 పేజీలు : 04

# భగవన్నామస్మరణతో జీవితం సార్థకం

- అలరించిన గరికపాటి ప్రవచనం
- వీక్షించిన వేలాదిమంది





ప్రవచనం చేస్తున్న గరికపాటి, హాజరైన ఎమ్మెల్యే పిఎలు, ప్రజలు, గరికపాటితో టిడిపి నాయకులు

**హిందూపురం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

భగవత్ నామస్మరణతోనే జీవితం సార్థకత లభిస్తుందని, శతాబ్దాల క్రితమే ఆనాటి ఇంజనీరింగ్ టెక్నాలజీతో లేపాక్షి ఆలయ నిర్మాణం జరిగిందని పద్మశ్రీ డాక్టర్ గరికపాటి నరసింహారావు పేర్కొన్నారు. సత్యసాయి జిల్లా హిందూపురంలో లేపాక్షి దేవాలయం పాలకమండలి ట్రస్ట్ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం శ్రీ వాసవి ధర్మశాలలో జరిగిన ప్రవచన కార్యక్రమానికి వేలాదిగా ప్రజలు తరలివచ్చారు. ప్రసిద్ధి క్షేత్రం లేపాక్షి బసవయ్య లేచి రావయ్య... అనే అంశం ఆధారంగా ప్రవచనం కొనసాగింది. సాయంత్రం 5.45 లకు గరికపాటి ఇక్కడికి చేరుకోగానే ప్రజల్లో విశేష స్పందన కనిపించింది. లేపాక్షిలో అద్భుత శిలలు, వేలాడ స్తంభం, లేపాక్షి నంది, శ్రీ వీరభద్ర స్వామి, దుర్గా దేవి ప్రస్తావిస్తూ ప్రసంగాన్ని అందించారు. హిందూ పురాణాలు ప్రస్తావిస్తూ నేటి ఆధునిక యుగాన్ని మేళవించి మహిళలు, యువత, కుటుంబాలకు సంబంధించి చక్కటి ప్రసంగంతో దిశా నిర్దేశం చేశారు. నాటి నాటక రంగం.. నేటి సినిమా రంగం పై నిర్మొహమాటంగా వాస్తవస్థితిని స్పష్టం చేశారు. స్త్రీలు నాటక రంగంలో వస్తే వారు పడే బాధలను తెలుసుకొని ఆనాడు మగవారే స్త్రీ పాత్రలు వేసే వారన్నారు. అయితే నేటి సినీ పరిశ్రమ లో మహిళలు ఏ రకంగా నలిగిపోతున్నారో.. అందరికీ తెలిసిందే నని ఇంతకన్నా తాను ఎక్కువ చెప్పలేను అన్నారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలను తల్లిదండ్రులు అనుసరిస్తే పిల్లలు నేర్చుకుంటారన్నారు. హిందూపురంలో వేలాదిమంది తన ప్రవచనం వినేందుకు రావడం పై గరికపాటి హర్షం వ్యక్తం చేశారు. దాదాపు రెండు గంటల ప్రసంగం 8 గంటలకు ముగిసింది. హిందూపురంలో మొదటిసారిగా సహస్ర అవడానికి గరికపాటి ప్రవచన కార్యక్రమం ఏర్పాటు చేయించిన లేపాక్షి దేవాలయం కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు పై ప్రజల్లో ప్రశంసలు వచ్చాయి. ఎమ్మెల్యే బాలకృష్ణ కార్యదర్శులు డాక్టర్ సురేంద్ర, వీరయ్య, బాలాజీ, మున్సిపల్ మాజీ చైర్మన్ రమేష్, సీనియర్ నాయకులు మంగేష్, పట్టణ అధ్యక్షులు ప్రెస్ వెంకటేష్, ఘనంగా సన్మానం చేశారు. అదనపు ఎస్పి మహేష్, ఇతర పోలీసు అధి కారులు, బిజెపి రమేష్ రెడ్డి, రాఘవేంద్ర, చంద్రమోహన్, దుర్గా నవీన్, యర్రగడ్ల పవన్ కుమార్ మొదలగు వారు పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయం

- కూటమి ప్రభుత్వం అభివృద్ధి వైపు అడుగులు వేస్తుంది
- త్వరలో పెడపల్లిప్రాంతంలో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు
- భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, ఎంపీ పార్థసారథి ,మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి.



కొత్తచెరువు నుంచి గోరంట్ల పల్లి రోడ్డు పనులకు భూమి పూజ చేస్తున్న ఎమ్మెల్యే ఎంపీ మాజీ మంత్రి పల్లె అధికారులు

**కొత్తచెరువు సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

గ్రామాల అభివృద్ధి కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని ప్రతి కుటుంబంపై సుమారు రూ.5 లక్షల అప్పు భారం మోపిన ఘనత అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిదేనని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో రాష్ట్రం అప్పుల నుంచి బయటపడుతూ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోందని తెలిపారు. పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో భాగంగా కొత్తచెరువు మండలం గోరంట్ల పల్లి లో రూ.1కోటి 50 లక్షలతో విబి జి రామ్ జి పథకం ద్వారా సోమవారం ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి చేతుల మీదుగా రోడ్డు పనులు ,కొత్త చెరువు లో గోకులం షెడ్ పనులకు శంకుస్థాపనలు చేశారు.

**గోరంట్లపల్లి లో రూ.1.50 కోట్లతో ప్రత్యేక రోడ్డు..**

వీబీజీ రామ్‌జీ పథకం కింద రూ.1.50 కోట్లతో గోరంట్లపల్లి నుంచి కొత్తచెరువుకు ప్రత్యేక రహదారి నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అలాగే కొత్తచెరువులో గోకులం షెడ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి మాట్లాడుతూ గ్రామాల అభివృద్దే కూటమి ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని అన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమం, ప్రతి గ్రామానికి అభివృద్ధి అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో ఇప్పటికే రూ.65 వేల కోట్లకు పైగా విలువైన వివిధ అభివృద్ధి, పెట్టుబడి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. త్వరలో పెడబల్లి ప్రాంతంలో 20 ఎకరాల్లో జీన్స్ పరిశ్రమ ఏర్పాటు కానుందని, తద్వారా సుమారు 4 వేల మంది మహిళలకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎమ్మెల్యే తెలిపారు. స్థానికంగా పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెంచేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు.

**గోరంట్లపల్లికి రూ.15 లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం**

హిందూపురం ఎంపీ బీకే పార్థసారథి మాట్లాడుతూ గోరంట్లపల్లిలో రూ.15 లక్షల ఎంపీ నిధులతో కమ్యూనిటీ భవనం నిర్మించేందుకు నిధులు మంజూరు చేస్తున్నట్లు హామీ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మరిన్ని పనులు చేపడతామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ పాలనపై విమర్శలు చేస్తూ, జగన్‌మోహన్ రెడ్డిని ఆయన తీవ్రంగా విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాల విషయంలో మిగతా 3లో...

# రైతుల అభివృద్ధే లక్ష్యంగా హార్టికల్చర్ హబ్

గాంధీ జయంతి రోజున మదనపల్లెలో శ్రీకారం.. రూ.లక్ష కోట్ల పెట్టుబడుల లక్ష్యం
2028 మార్చి నాటికి బీటీపీ పూర్తి చేసి నీరు అందిస్తాం
రెండేళ్లలో గ్రామాల నుంచి పొలాలకు రహదారుల నిర్మాణం: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మల్లిపల్లి గ్రామములో టమోటో పంటల సాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



సహపంక్తి బోజనాలలో పాల్గొన్న దృశ్యం

**కళ్యాణదుర్గం, సెప్టెంబరు 29 ప్రభాతవార్త:**

రైతుల సంక్షేమం, ఉద్యాన పంటల అభివృద్ధి, సాగునీటి సమస్యల పరిష్కారం, గ్రామీణ రహదారుల నిర్మాణానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కళ్యాణదుర్గం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్ర బాబు పేర్కొన్నారు. కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామంలో "రాయలసీమ విజయాభవ" కార్యక్రమంలో భాగంగా టమోటా, బొప్పాయి పంటలు సాగు చేస్తున్న రైతుల పొలాలను ఆయన మండల పార్టీ నాయకులతో కలిసి సందర్శించి రైతులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అక్టోబరు 2న గాంధీ జయంతి సందర్భంగా అన్నమయ్య జిల్లా మదనపల్లెలో రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ హబ్‌కు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.రాయలసీమలోని పలు జిల్లాలతో పాటు ప్రకాశం, నెల్లూరు ప్రాంతాల్లో ఉద్యాన రంగాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో మిగతా 3లో...

## అర్ధరాత్రి ఆకతాయిల ఆగడం

తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి అదనపు వాహనం ధ్వంసం



వివరాలు 3లో...

# అనంతపురం జిల్లా రైతులకు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించాలి

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**అనంతపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం నేటి నుంచి పల్లె పండుగ-3.0 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న నేపథ్యంలో, అనంతపురం జిల్లాలో నెలకొన్న తీవ్ర కరువు పరిస్థితులకు అనుగుణంగా గ్రామీణ అభివృద్ధి ప్రాధాన్యతలను మార్చాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మంగళవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. పల్లె పండుగ-3.0 కింద రాష్ట్రవ్యాప్తంగా రూ.11,085 కోట్లతో రహదారులు, మినీ గోకులాలు, ఉద్యాన పంటలు, డ్రెయినేజీలు, గ్రామీణ మౌలిక వసతుల పనులు చేపట్టనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కరువు తీవ్రంగా ఉన్న అనంతపురం వంటి జిల్లాల్లో గ్రామీణ అభివృద్ధిని కేవలం రోడ్లు, డ్రెయినేజీలు, భవనాల నిర్మాణంతో కొలవడం సరిపోదని శ్రీనివాసరావు అన్నారు. రైతు పంట పండించుకోగలగడం, కౌలు రైతు అప్పుల ఊబి నుంచి బయటపడటం, వ్యవసాయ కూలీకి పని దొరకడం, గ్రామీణ కుటుంబాలకు తాగునీరు-పశుగ్రాసం అందడం, పిల్లల చదువులు కొనసాగడం వంటి అంశాలే కరువు సమయంలో పల్లె అభివృద్ధికి అసలు కొలమానాలని పేర్కొన్నారు.గత రెండు విడతల పల్లె పండుగలో రోడ్లు, పశువుల షెడ్లు, వ్యవసాయ కుంటలు, ఉద్యాన పంటల విస్తరణ తదితర పనులు చేపట్టినట్లు ప్రభుత్వం చెబుతోంది. ఇప్పుడు మూడో విడతకు రూ.11,085 కోట్లు కేటాయిస్తున్న నేపథ్యంలో గత రెండు విడతల్లో ఖర్చు చేసిన నిధులతో గ్రామీణ ప్రజల జీవనోపాధిలో వచ్చిన మార్పు, రైతుల ఆదాయంపై పడిన ప్రభావం, కరువు ప్రాంతాల్లో నీటి లభ్యత పెరిగిన స్థాయి వంటి అంశాలపై ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన లెక్కలు చెప్పాలి అని డిమాండ్ చేశారు.

2026 ఖరీఫ్‌లో కరువు పరిస్థితులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను ప్రభుత్వం గుర్తిస్తున్న నేపథ్యంలో అనంతపురం జిల్లాలో పరిస్థితిని కేవలం సాధారణ వర్షాభావంగా చూడకుండా తీవ్రమైన కరువు సంక్షోభంగా గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలి అని అన్నారు. వర్షాభావంతో పంటల సాగు దెబ్బతినడం, బోర్లు ఎండిపోవడం, ఉద్యాన పంటలు నష్టపోవడం వల్ల రైతులు నష్టపోతుండగా, వ్యవసాయ పనులు తగ్గడంతో కూలీలకు ఉపాధి కూడా లేకుండా పోయిందన్నారు.అందువల్ల అనంతపురం జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించి, జిల్లాకు రూ.20 వేల కోట్ల ప్రత్యేక కరువు ప్యాకేజీని వెంటనే ప్రకటించాలి. పంట సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.50 వేల పంట నష్టపరిహారం, పంట సాగు చేయలేని రైతులకు ఎకరాకు రూ.20 వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతులను కూడా పరిహారం పరిధిలోకి తీసుకురావాలని కోరారు. కరువు ప్రభావంతో వ్యవసాయ పనులు తగ్గినందున ఉపాధి హామీ పనులను విస్తృతంగా చేపట్టి కనీసం 200 రోజుల పని కల్పించాలని, కూలీలకు గిట్టుబాటు కూలి అందేలా చూడాలని అన్నారు. తాగునీటి ఎద్దడి ఉన్న గ్రామాలకు అత్యవసరంగా నీటి సరఫరా చేపట్టడంతో పాటు పశువులకు పశుగ్రాసం, నీటి సౌకర్యం కల్పించాలని కోరారు. ఎండిపోతున్న ఉద్యాన తోటలను రక్షించేందుకు ప్రత్యేక ప్యాకేజీ, పంటల బీమా పరిహారం, సాగు పెట్టుబడి సహాయం సకాలంలో అందించాలని డిమాండ్ చేశారు.కరువు మండలాల ప్రకటన కేవలం ప్రభుత్వ ఉత్తర్వుగా మిగిలిపోకుండా, ప్రకటన జరిగిన వెంటనే సహాయక చర్యలు ప్రారంభించాలి. రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కూలీలు, గ్రామీణ పేదలు ఎదుర్కొంటున్న నష్టాలను మండలాల వారీగా అంచనా వేసి ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని అన్నారు. రైతుల ఆత్మహత్యలు, వలసలు, అప్పుల భారం పెరగకుండా అత్యవసర ఉపశమన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలపై జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్‌ను కలిసి జిల్లాలోని కరువు పరిస్థితులను వివరించి వినతిపత్రం అందించినట్లు శ్రీనివాసరావు తెలిపారు. అనంతరం సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్.నాగేంద్ర కుమార్, బాల రంగయ్య, ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, బి.శ్రీనివాసులు, కృష్ణమూర్తి, రామ్ రెడ్డి పాల్గొన్నారు.

# ఓటు భద్రతపై పెద్ద ఎత్తున ప్రజా ఉద్యమంపై నిర్ణయం



సిడబ్ల్యూసి సమావేశంలో పాల్గొన్న రఘువీరారెడ్డి

**అమరాపురం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

ఓటు భద్రత పై ప్రజా ఉద్యమాన్ని పెద్ద ఎత్తున నిర్మించాలని సి డబ్ల్యూ సి సమావేశంలో నిర్ణయం తీసుకోనట్లు సిడబ్ల్యుసి సభ్యుడు రఘువీరారెడ్డి పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం" తీరు పై ప్రజా ఆందోళన నిర్వహించాలని నిర్ణయం. తీసుకున్నట్లు తెలిపారు. ఓటు భద్రత, సక్రమమైన ఓటర్ల జాబితా అనే ఏకైక అంశం పై సమావేశంలో చర్చ జరిగింది. ఓటు హక్కుకు భద్రత లేకపోతే ప్రజాస్వామ్యం, రాజ్యాంగం నవ్వుల పాలవుతుంది. ఓటు భద్రత పై దేశంలోని ప్రజలను అప్రమత్తం చేస్తూ, పూర్తి అవగాహన కల్పించేలా దీర్ఘకాలం క్షేత్ర స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయం.ఎన్నికల సంఘాన్ని నిర్వీర్యం చేస్తున్నారన్న అంశంపై చర్చించాం. కేంద్ర ఎన్నికల సంఘం" పనితీరు, ఓటు చోరీ ఏ విధంగా జరుగుతుందో, ప్రజాస్వామ్యం ఏ విధంగా కూని అవుతుందో చర్చించాం. ఈవీఎంలు రద్దు కావాలి, పేపర్ బ్యాలెట్ విధానంలో ఎన్నికలు జరగాలి. 2025 జూన్ తర్వాత ఎస్ఐఆర్ ప్రక్రియ ద్వారా రూపొందించిన ఓటర్ల సవరణ జాబితాను రద్దు చేయాలి. కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలి. కేంద్ర ఎన్నికల సంఘం పూర్తి పారదర్శకతతో బాధ్యతలు నిర్వర్తించేలా ప్రజా ఉద్యమం చేయాలి. దేశంలో 13 కోట్ల మంది ఓటర్ల పేర్లు తొలగించారు,ఇది క్షమించరాని నేరం. ఏపీలోనే 44 లక్షల ఓట్లు తొలగించారు. ఇవన్నీ పేద వర్గాలు, నోరులేని వారివి. బిజెపికి వ్యతిరేకంగా ఓటు వేసే వారి ఓట్లను తొలగిస్తున్నారు. రాహుల్ గాంధీ చాలా రోజుల నుంచి "కేంద్ర ఎన్నికల సంఘం" తీరుపై పోరాటం చేస్తున్నారు. రాహుల్ గాంధీని సమావేశంలో అభినందించాం. ఎన్నికల కమిషన్ వ్యవహార శైలి పై మొదట రాహుల్ గాంధీ మాట్లాడితే అందరూ తేలిగ్గా తీసుకున్నారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ ను ఎన్నుకునే "ఉన్నతస్థాయి కమిటీ" నుంచి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు."కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్" పై ఎలాంటి చర్యలు తీసుకునే ఆస్కారం లేకుండా మోడి ప్రభుత్వం నిబంధనలను సవరించి, భద్రతను కల్పించడంపై చర్చ జరిగింది. ప్రధాని మోడి, హోం మంత్రి అమిత్ షా కు ప్రజలపై విశ్వాసం, నమ్మకం తొలగిపోయి,కేంద్ర ఎన్నికల సంఘం ను అడ్డం పెట్టుకొని అధికారం సాధించారు. దొంగ ఓట్లతో అధికారంలోకి వచ్చారు. ప్రభుత్వంలో ఉండేందుకు అర్హులు కాదు.

# రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్ వర్క్ షాప్

- రూ. లక్ష కోట్ల ప్రాజెక్టు వ్యయంలో రైతులకు భారీ ఊరట..
- ఎల్ నినో ప్రభావం దృష్ట్యా టార్గెట్‌తో నిమిత్తం లేకుండా ఫామ్ పాండ్స్, వీడ్ మ్యాట్ సౌకర్యాలు..
- ఆంధ్రప్రదేశ్ ఫ్రూట్ బౌల్ గా మన జిల్లాను మరింత ముందుకు తీసుకెళ్దాం: జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్..



రైతులకు రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్మెంట్ ప్రాజెక్టుపై వర్క్ షాప్ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్

**కొత్తచెరువు,సెప్టెంబర్, 29 ప్రభాతవార్త**

రాయలసీమ ప్రాంతం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి చెందిందని జిల్లాలోని వివిధ రకాల పండ్ల తోటల సాగులో అగ్రగామి గా నిలుస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికే ఫ్రూట్ బౌల్‌గా గుర్తింపు పొందిందని జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ కొనియాడారు. శ్రీ సత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం నారేపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ ఏ శ్యాం ప్రసాద్ అధ్యక్షతన "రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్" పై ప్రత్యేక అవగాహన వర్క్‌షాప్ ఘనంగా నిర్వహించబడింది.జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం ఉద్యాన పంటలకు ప్రసిద్ధి చెందిందని,.రాయలసీమ ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్ ప్రాజెక్ట్ మొత్తం వ్యయం రూ. 1,00,000 కోట్లు (లక్ష కోట్లు) అని కలెక్టర్ తెలిపారు. రూ. 40,000 కోట్లు - ప్రభుత్వ వాటారూ. 60,000 కోట్లు - ప్రైవేట్ భాగస్వామ్య / రైతుల వాటా ఈ బృహత్తర పథకాన్ని జిల్లాలోని రైతు సోదరులందరూ సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు.ప్రస్తుతం నెలకొన్న ఎల్ నినో వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా, నీటి నిల్వ మరియు సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. వీడ్ మ్యాట్ మరియు ఫారం పాండ్స్ ప్రాముఖ్యతను రైతులకు వివరించాలి. జిల్లాలో ఎలాంటి టార్గెట్లతో నిమిత్తం లేకుండా అర్హులైన ప్రతి రైతుకూ ఈ పథకాలను విస్తృతంగా అమలు చేయాలని ఉద్యానవన శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ వర్క్‌షాప్‌లో జిల్లా వ్యవసాయ అధికారి కృష్ణయ్య, జిల్లా ఉద్యాన అధికారి జయకుమార్ బాబు, జిల్లా సూక్ష్మ సేద్య అధికారి దేవానంద్, జిల్లా డాట్ సెంటర్ అధికారి బాలాజీ నాయక్, అగ్రికల్చర్ కమిషనరేట్ స్పెషల్ ఆఫీసర్ మాధవి లత, కొత్తచెరువు మరియు బుక్కపట్నం మండలాల తహశీల్దార్లు, నారాయణరెడ్డి బాల ఆంజనేయులు మండల వ్యవసాయ అధికారులు సతీష్ బాబు నటరాజ్, పుట్టపర్తి ఉద్యాన అధికారి నవీన్ కుమార్, కొత్తచెరువు, బుక్కపట్నం మండలాల గ్రామ ఉద్యాన సహాయకులు పాల్గొన్నారు.

# అక్రమాలకు అధికారుల వత్తాసు..!

: ప్రజాప్రయోజనాలపై రెవెన్యూ 'ప్రతాప'ం
: బంజరు భూములను అక్రమంగా కట్టబెట్టే యత్నం
: యాడికి రెవెన్యూ అధికారులపై ఎమ్మార్పీఎస్ నాయకుల ధ్వజం



తహసీల్దార్ కార్యాలయం వద్ద మీడియాతో ఎమ్మార్పీఎస్ నాయకులు

**యాడికి(తాడిపత్రి), సెప్టెంబరు 29, ప్రభాతవార్త**

యాడికి మండలం వేములపాడు పరిధిలోని విలువైన బంజరు భూమిని కాజేసే ప్రయత్నం చేస్తున్న అక్రమాలకు రెవెన్యూ అధికారులు వత్తాసు పలుకుతున్నారని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు మంగళవారం ధ్వజమెత్తారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట వారు మీడియాతో మాట్లాడుతూ..ప్రభుత్వం కల్పిస్తున్న 22(ఎ) వెసలు బాటును అక్రమార్కులకు అనుకూలంగా మలిచేలా రెవెన్యూ అధికారుల చర్యలు ఉన్నాయని వారు ఆరోపించారు. వేములపాడు మజారాలోని సర్వే నంబరు 158లో ఉన్న 9.11 ఎకరాల బంజరు భూమి అన్యాక్రాంతం కాకుండా, ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలంటూ 14 ఏళ్లుగా ఎమ్మార్పీఎస్ పోరాటం చేస్తోందని, అక్రమార్కులు ఎప్పటికప్పుడు సదరు భూమిలో పాగా వేయాలనుకునే ప్రతి సారీ ఎమ్మార్పీఎస్ రెవెన్యూ అధికారులు, న్యాయస్థానాల దృష్టికి తీసుకొనిపోతోందని వారు వివరించారు. సర్వే నం. 158లోని 9.11 ఎకరాల భూమి విలువ ప్రస్తుత బహిరంగ మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.3 కోట్లు ఉంటుందని, ఇంతటి విలువైన స్థలాన్ని ప్రభుత్వ, ప్రజల అవసరాలకు వినియోగించాలనేదే ఎమ్మార్పీఎస్ ఉద్దేశమని వారు తెలిపారు. గతంలో ఈ సర్వే నంబరులోని భూమిలో ఒక సెంటు కూడా ఎవరికీ డి.పట్టా ఇవ్వలేదని, ఇందులో జరిగిన రిజిస్ట్రేషన్లను రద్దు చేయాలని పూర్వ తహసీల్దార్ కుమారస్వామి రూపొందించిన నివేదిక చెబుతోందని వారు అన్నారు. సదరు భూమిలో ఎవరికీ ఎలాంటి డి.పట్టా ఇచ్చినట్లు తహసీల్దార్ కార్యాలయంలో ఆనవాళ్లు లేవని, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను, రిజిస్ట్రేషన్ల లావాదేవీలను రద్దు చేయాలని కోరుతూ పూర్వ తహసీల్దార్లు భాస్కర్ బాబు, బ్రహ్మయ్య, అలెగ్జాండర్‌లు నివేదికలు రూపొందించారని వారు విశదీకరించారు. ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు సదరు భూమిని రిజిస్ట్రేషన్ చేయించుకోవడం, పట్టాదారు పాసుపుస్తకాలు పొందడం, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసుకోవడం వంటి చర్యలపై ఎమ్మార్పీఎస్ చట్టబద్ధంగా, న్యాయబద్ధంగా పోరాటం చేస్తుంటే ప్రస్తుత రెవెన్యూ అధికారులు వారికి వంత పాడేలా వెసలుబాటు కల్పిస్తున్నారని వారు ఆరోపించారు. సదరు బంజరు భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని తాము పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేస్తే ఆర్డీవో కార్యాలయానికి నివేదిక పంపి పరిష్కారం చూడాల్సింది పోయి అవతలి వారు న్యాయస్థానాన్ని ఆశ్రయించేలా తీవ్ర జాప్యం చేయడం రెవెన్యూ అధికారుల వైఖరి ఎలాంటిదో స్పష్టం చేస్తోందని వారు అన్నారు. అక్రమాలకు గొడుగు పట్టేలా ప్రస్తుత ప్రస్తుత రెవెన్యూ అధికారులు సలహాలు, సూచనలు ఇచ్చి అక్రమార్కులు వంత పాడుతున్నారని వారు విమర్శించారు. సర్వే నంబరు 158లోని 9.11 ఎకరాల్లో కల్లూరు, పామిడి ప్రాంతాలకు చెందిన నలుగురు వ్యక్తుల పేరిట జరిగిన రిజిస్ట్రేషన్‌ను, రెవెన్యూ రికార్డుల్లో నమోదైన వివరాలను రద్దు చేయని పక్షంలో అక్రమాలకు సహరిస్తున్న ఇక్కడి రెవెన్యూ అధికారులపై న్యాయ పోరాటం చేస్తామని వారు తెలిపారు. రెవెన్యూ అధికారుల తీరును విమర్శించిన వారిలో తాడిపత్రి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఎంపీ పుల్లయ్య, నరసింహులు, సూర్యుడు, కుళ్లాయప్ప, రామాంజినేయులు, చినరాముడు, శేఖర్ తదితరులు ఉన్నారు.

# పాఠశాలల్లో ఎన్నికల సందడి..!

- 1,685 పాఠశాలల్లో ఎస్ఎంసీ ఎన్నికలు పూర్తి
- 1,723 పాఠశాలలకు గాను 38 చోట్ల ఎన్నికలు వాయిదా
- 29 పాఠశాలల్లో కోరం లేక.. 9 చోట్ల శాంతిభద్రతల సమస్య
- జిల్లా విద్యాశాఖ, సమగ్రశిక్ష అధికారుల పర్యవేక్షణ
- ఎన్నికల సమయంలో పాఠశాలల వద్ద పోలీసు బందోబస్తు

వివరాలు 3లో...



02ATP26_02ATP26.qxd 29-09-2026 PM 10:05 Page 1



# రైతు కష్టం జింకల పాలు.. కాపలా ఉన్న ఫలితం శూన్యం

**జింకల జోలికెళితే కేసులు .. ఊరకుంటే పంట నాశనం**
**జింకలను అడవి ప్రాంతం వైపు మళ్ళించాలని అన్నదాత ఆవేదన**

రొళ్ల సెప్టెంబర్ 29 ప్రభాతవార్త


రైతు రాజు

గుంపులు గుంపులుగా చెంగు చెంగున ఎగురుతూ జింకలు పంట పొలాలను నాశనం చేస్తున్నాయి. మండలంలోని పలు ప్రాంత రైతులకు కంటిమీద కునుకు లేకుండా జింకలు చేస్తున్నాయి. ఒక వైపు వర్షాభావం.. మరో వైపు జింకల బెడదతో పంటలను కాపాడుకునేందుకు అన్నదాతలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మండలంలో పత్తి, పొద్దుతిరుగుడు, వేరుశనగ, కంది, పెసర, జొన్న, మిరప, కొర్ర, సజ్జ పంటలను సాగు చేశారు. కష్టపడి సాగు చేసిన పంటలను జింకలు మట్టిపాలు చేస్తున్నాయి. ఒక్కో మందలో 15 నుంచి 20 జింకలు సంచరిస్తున్నాయి. మండలంలోని కాకి, దొడ్డేరి, రత్నగిరి, వద్రహట్టి, హనుమంతనపల్లి, మళ్లీన మడుగు బిజీ హళ్లి తదితర ప్రాంతాల్లో వీటి సంచారం ఎక్కువగా ఉంది. పొలాల్లో ఎక్కడ చూసినా జింకల మందలే కనిపిస్తాయి. వాటి జోలికెళితే కేసులు పెడతారనే భయం.. ఊరకుంటే పంట నాశనం చేస్తాయనే బెంగ.. ఎటూ పాలుపోక దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. కాకి గ్రామం రైతు రాజప్ప : వానకాలం ప్రారంభంలోనే రూ.30వేలు దాకా అప్పు చేసి ఒక ఎకరా విస్తీర్ణంలో వేరుశనగ విత్తనాలు వితనన్నారు. మొదటి దశలో పంట ఆశాజన కంగా ఉన్న రెండో దశ సమయానికి అనుగుణంగా వర్షం కురవకపో వడంతో పంటలు ఎండిందన్నారు. మరోవైపు జింకల బెడద ఎక్కువై ఎండిన వేరుశనగని సైతం జింకలు పూర్తిగా తినేస్తున్నాయన్నారు. ఒక్కసారి జింక మందతో పంట పొలాల పై వస్తే 20 నుంచి 30 దాకా వస్తున్నాయన్నారు. కాపలా ఉన్న ఫలితం లేకుండా పోతుందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అటవీశాఖ అధికారులు వీటిని అటవీ ప్రాంతం వైపు మళ్ళించాలని కోరారు. పంటను కాపాడుకోవడం రైతులకు సాధ్యం కావడం లేదు. ఫెన్సింగ్, కాపలా వంటి చర్యలు సరిపోవడం లేదని రైతులు చెబుతున్నారు. వెంట నే అటవీ శాఖ అధికారులు స్పందించి రైతుల పొలాలకు రక్షణ చర్యలు తీసు కోనీ, జింకల బెడద నుంచి విముక్తి కల్పించాలని రైతులు కోరుతున్నారు. నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించి, జింకలను అడవి ప్రాంతం వైపు మళ్లించేందుకు చర్యలు చేపట్టాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలి

**- అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలి**
**- మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి**


సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న నారాయణస్వామి

గుంతకల్లు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని మండల ఇన్‌చార్జ్ గుమ్మనూరు నారాయణస్వామి అధికారులకు సూచించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అర్బన్ హౌసింగ్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. పథకాల సమాచారం, అర్హత, లబ్ధికారులకు తెలియజేయాలన్నారు. ప్రధానంగా గృహ నిర్మాణానికి సంబంధించి ఎదురయ్యే సమస్యలు, దరఖాస్తులకు అవసరమయ్యే ప్రక్రియను పూర్తిగా వివరించాలన్నారు. లబ్ధిదారుల విషయంలో అధికారుల నిర్లక్ష్యం మంచిది కాదని ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశంలో హౌసింగ్ అధికారులు, మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

# కేజీబీవీలో కమిటీ ఎన్నికల సందడి..

**యస్‌ఓ లలిత ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు..**


నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు

శెట్టూరు సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నికలు మంగళవారం యస్‌ఓ లలిత ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికల ప్రక్రియలో విద్యార్థుల తల్లిదండ్రులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియలో భాగంగా ముందుగా తల్లిదండ్రులకు కమిటీ ఎన్నికల విధానం, సభ్యుల బాధ్యతలను వివరించారు. అనంతరం అర్హులైన తల్లిదండ్రుల నుంచి కమిటీ సభ్యుల ఎంపికకు సంబంధించిన ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించారు. పాఠశాల యాజమాన్య కమిటీ ద్వారా విద్యార్థుల విద్యా ప్రమాణాలు, పాఠశాల అభివృద్ధి, మౌలిక వసతులు, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై తల్లిదండ్రులు తమ సూచనలు, అభిప్రాయాలను తెలియజేయడానికి అవకాశం కల్పించారు. ఈ కార్యక్రమానికి టీడీపీ నాయకులు హాజరై ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయం మేరకు చైర్మన్ కురుబ త్రివేణి వైస్ చైర్మన్ గా ఏ. మల్లేశ్వరి లను ఎంపిక చేసినట్లు యస్‌ఓ తెలిపారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులు పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని విద్యార్థులకు మెరుగైన విద్య, మౌలిక వసతులు కల్పించేందుకు పాఠశాల సిబ్బందితో సమన్వయంతో పనిచేస్తామని పేర్కొన్నారు. పాఠశాల సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. మండల పరిధిలో ఉన్న అన్ని ప్రభుత్వ పాఠశాలలలో ప్రభుత్వ నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ జరిగిందని మండల విద్యాశాఖ అధికారులు శ్రీధర్, వాణిదేవిలు తెలిపారు.

# సజావుగా విద్యా కమిటీ చైర్మన్ల ఎన్నికలు



నూతన విద్యా కమిటీ చైర్మన్లతో ప్రమాణ స్వీకారం చేయిస్తున్న దృశ్యం

గుత్తి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

గుత్తి, గుత్తి ఆర్ఎస్ పట్టణాలతో పాటుగా గ్రామీణ ప్రాంతాల్లో మంగళవారం ప్రభుత్వ పాఠశాలల విద్యా కమిటీ చైర్మన్ల ఎంపిక సజావుగా కొనసాగింది. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి రవినాయక్, ఎంపీడీఓ ప్రభాకర్‌నాయక్‌ల ఆధ్వర్యంలో ఎన్నికలు జరిగాయి. మండల వ్యాప్తంగా 55 ప్రాథమిక పాఠశాలలు, 14 ఉన్నత పాఠశాలలు అదేవిధంగా నాలుగు రెసిడెన్షియల్ పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలల్లో ఎన్నికలను నిర్వహించారు. అన్ని ప్రాంతాల్లో ఏకగ్రీవంగా కమిటీల ఎంపిక జరిగింది. అనంతరం నూతనంగా ఎంపికైన కమిటీ సభ్యులతో ఎంఈఓ ప్రమాణస్వీకారం చేయించారు. ఏలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

# చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటే తాటతీస్తాం

**మత విద్వేషాలు వద్దు మానవత్వమే ముఖ్యం**
**హిందూపురం ఏ.ఎస్పి మహేష్**


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఏఎస్పీ మహేష్

హిందూపురం టౌన్ సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

లేపాక్షి మండలంలో గత కొన్నేళ్లుగా రెండు మతాలకు చెందిన వారి మధ్య జరుగుతున్న వరుస ఘటనలపై హిందూపురం అదనపు ఎస్పి కేవీ మహేష్ సీరియస్ అయ్యారు. లేపాక్షి మండలంలో కొందరు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్నారని ఇలాంటివి చేస్తే తాట తీస్తామని ఘాటుగా హెచ్చరించారు. మత విద్వేషాలు వద్దని మానవత్వమే ముఖ్యమని ప్రతి ఒక్కరూ తెలుసుకొని జీవించాలని ఆయన తెలిపారు. మంగళవారం హిందూపురం అడిషనల్ ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేష్ మాట్లాడుతూ ఈనెల 24వ తేదీన లేపాక్షి పోలీస్ స్టేషన్లో నమోదు అయిన మిస్సింగ్ కేసులో షాహినా, వడ్డే సీన ఇద్దరూ ఈనెల 25వ తేదీన పోలీస్ స్టేషన్లో హాజరయ్యేందుకు వస్తుండగా అమ్మాయి బంధువులైన జీషన్, ఆరిఫ్, అబ్రర్, ఇస్మాయిల్ నలుగురు కలిసి పోలీస్ స్టేషన్కు వస్తున్న ప్రేమ జంటను అడ్డగించి బైకుతో ఢీకొట్టడం జరిగింది ఈ ఘటనలో అబ్బాయి వడ్డె శ్రీను తీవ్ర గాయాల పాలయ్యాడు. దీనిపై కూడా లేపాక్షి పోలీస్ స్టేషన్లో కేసు నమోదు అయింది కేసు కోసం సంబంధించి ముద్దాయిలను రిమాండ్కు తరలించారు. అమ్మాయి మిస్సింగ్ అయ్యేందుకు లేపాక్షి మండలం బీజేవైఎం అధ్యక్షుడు ఈశ్వర్ ప్రసాద్ కారణమని అతనిపై కోపాన్ని పెంచుకున్న అమ్మాయి తండ్రి అక్రమ్ భాష, ఇస్మాయిల్ ఇద్దరూ కలిసి ఈశ్వర ప్రసాద్ పై దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనపై కూడా కేసు నమోదు అయింది. ఇవే కాకుండా గత కొన్నేళ్ల నుండి లేపాక్షి మండల వ్యాప్తంగా పలుచోట్ల ఇరువర్గాల మధ్య చిన్న చిన్న గొడవలు తారాస్థాయికి చేరి లా అండ్ ఆర్డర్ సమస్యగా మారుతున్నాయని ఏఎస్పి అన్నారు. ఇప్పటికైనా లేపాక్షి మండలానికి చెందిన ఇరు మతాల వారు మానవత్వంతో మెలగాలని సూచించారు. ఎవరికి ఎలాంటి ఇబ్బంది ఉన్నా పోలీసులను వెంటనే సంప్రదించాలని పోలీసులు తక్షణమే అందరికీ రక్షణ కల్పిస్తారని ఇది విస్మరించి చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని దాడులకు పాల్పడితే చట్టపరిధిలో శిక్ష తప్పదని తెలిపారు. ఈ సమావేశంలో రెండవ పట్టణ సీఐ కరీం, రూరల్ సీఐ జనార్ధన్, లేపాక్షి ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికలు


ఎస్ఎంసి ఎన్నికల్లో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్ఐ


ఎస్ఎంసి చైర్మన్ లను సన్మానిస్తున్న జిల్లా బిజెపి ఉపాధ్యక్షుడు

డి.హిరెహాళ్ సెప్టెంబరు 29 ప్రభాతవార్త

రాష్ట్రవ్యాప్తంగా జరిగిన స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ఎన్నికల్లో భాగంగ మండల పరిధిలో ప్రశాంతమైన వాతావరణంలో ఏకగ్రీవంగ, ప్రశాంతంగా ముగిశాయి. మంగళవారం డి.హిరెహాళ్ మండలంలో ఎంఈఓ లు వేణుగోపాల్, సనోవర్ భాష, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎస్ఎంసి ఎన్నికల్లో పాల్గొని అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, సభ్యులను ఎన్నుకున్నారు. మండలంలో ఒక జూనియర్ కాలేజ్, 15 ప్రాథమిక పాఠశాలలు, 35 ఉన్నత పాఠశాలలకు ఎన్నికలు జరుగగా ఇందులో 51 మంది అధ్యక్షులు, 51 మంది ఉపాధ్యక్షులు ఎంపికయ్యారు. హెచ్ సిద్దాపురంలో ప్రాథమిక పాఠశాలకు, ఉన్నత పాఠశాలకు జరిగిన ఎస్ఎంసి ఎన్నికల్లో ఏకగ్రీవంగా ఎన్నికైన అధ్యక్షులు ఎస్ కే బి రమేష్ గౌడ్, చందు నాయక్, ఉపాధ్యక్షులు చిగరి మంజుల, చిదరి లక్ష్మీదేవి, సభ్యులను బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు వన్నూరుస్వామి ప్రధానోపాధ్యాయులు గౌరీ శంకర్, సూర్యనారాయణ, ఉపాధ్యాయుల తో కలిసి సన్మానించారు. మండలంలో ఎస్ఎంసి ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండ ఎస్.ఐ. గురు ప్రసాద్ రెడ్డి తమ సిబ్బందితో కలిసి గట్టి బందోబస్తు నిర్వహించారు.

# ప్రశాంతంగా విద్యా కమిటీ చైర్మన్ ల ఎంపిక


మాట్లాడుతున్న సిఐ దేవానంద్

రాయదుర్గం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

రాయదుర్గం అర్బన్ పరిధిలోని 77 పాఠశాలలలో సోమవారం విద్యా కమిటీ చైర్మన్ ల ఎన్నిక ప్రక్రియ లు ప్రశాంతంగా నిర్వహించినట్లు ఎంఈఓ ఇర్షద్ మహమ్మద్ పేర్కొన్నారు. అర్బన్ తో పాటు రాయదుర్గం మండల పరిధిలోని ఒక ఆయత్తు పల్లి గ్రామంలో మాత్రం రి ఎలక్షన్స్ నిర్వహించాలని విద్యార్థులు తల్లిదండ్రులు సమాచారం మేరకు ఎస్ఎంసి ఎన్నికలు వాయిదా పడినట్లు ఆయన తెలిపారు. పాఠశాలలతో పాటు 8 ప్రైవేట్ పాఠశాలల్లో కూడా విద్యా కమిటీ చైర్మన్ ఎన్నికలు నిర్వహించినట్లు ఎంఈఓ సూచించారు. ఈ సందర్భంగా రాత్రి దుర్గం అర్బన్ సిఐ దేవానంద్ ఆధ్వర్యంలో అన్ని పాఠశాలల వద్ద గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. అర్బన్ పరిధిలోని 78 ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిది ప్రైవేట్ పాఠశాలల్లో ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాల మేరకు ఆయా పాఠశాలల కమిటీలతోపాటు చైర్మన్ మరియు వైస్ చైర్మన్ ఎంపికలపై ప్రశాంత వాతావరణం లో నిర్వహించినట్లు వారు పేర్కొన్నారు.

# 54 పాఠశాలలకు ఎస్ఎంసీ చైర్మన్, వైస్ చైర్మన్‌ల ఎన్నిక

**నాలుగు పాఠశాలలో ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా**

కంబదూరు, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త

కంబదూరు మండలంలోని 58 పాఠశాలల్లో మంగళవారం స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికలు నిర్వహించగా, 54 పాఠశాలల్లో చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకున్నట్లు విద్యాశాఖ అధికారులు మంగళవారం మీడియాకు తెలిపారు. మర్రిమాకులపల్లి, రాంపురం, తిమ్మాపురం గురుకుల పాఠశాల, అచ్చంపల్లి గ్రామ పాఠశాలలో అనివార్య కారణాల వల్ల ఎస్ఎంసీ ఎన్నికలు వాయిదా పడినట్లు అధికారులు పేర్కొన్నారు. ఆయా పాఠశాలల్లో తదుపరి తేదీలో ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

# ధర్మవరంలో చెడ్డీగ్యాంగ్ హల్‌చల్

**- సీసీ కెమెరాల్లో చెడ్డీగ్యాంగ్ కదలికలు - చోరీలకు యత్నం.. అప్రమత్తమైన స్థానికులు**
**- చెడ్డీగ్యాంగ్‌పై పోలీసుల ప్రత్యేక నిఘా**



గీతానగర్‌లో సీసీ కెమెరాల్లో నమోదైన చెడ్డీగ్యాంగ్ సభ్యుల కదలికల దృశ్యాలు

ధర్మవరంటౌన్, సెప్టెంబరు 29 ప్రభాతవార్త

పట్టణంలోని గీతానగర్, గాంధీనగర్ తదితర ప్రాంతాల్లో చెడ్డీగ్యాంగ్ కదలికలు సీసీ కెమెరాల్లో నమోదైనట్లు తెలుస్తోంది. అర్ధరాత్రి సమయంలో పలుచోట్ల ఇళ్లలోకి ప్రవేశించి చోరీలకు పాల్పడేందుకు ప్రయత్నించిన ముఠా సభ్యులు స్థానికులు అప్రమత్తం కావడంతో అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం. గీతానగర్ ప్రాంతానికి చెందిన నాగేశేషు, పణీంద్ర, రంగనాథ్ తదితరుల ఇళ్ల వద్ద ముఠా సభ్యులు అనుమానాస్పదంగా సంచరించినట్లు స్థానికులు గుర్తించారు. కొందరు ఇంటి యజమానులు శబ్దాలు విని అప్రమత్త మై కేకలు వేయడంతో ముఠా సభ్యులు పరారైనట్లు తెలిసింది. అనంతరం స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనకు సంబంధించిన సీసీ కెమెరా దృశ్యాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. ముఠాలో సుమారు ఏడుగురు సభ్యులు ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు సమాచారం. వీరు ఇతర రాష్ట్రాలకు చెందిన వారై ఉండొచ్చనే అనుమానంతో పోలీసులు ఆ కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. చోరీలకు పాల్పడే ముఠాల కదలికలను గుర్తించేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో డీఎస్పీ బీవీ జగన్నాథరాజు ఆధ్వర్యంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలను రంగంలోకి దించినట్లు తెలిసింది. సీసీ కెమెరాల దృశ్యాలు, స్థానికుల నుంచి సేకరించిన సమాచారాన్ని విశ్లేషిస్తూ అనుమానితులను గుర్తించే ప్రక్రియ కొనసాగుతోంది. పట్టణ ప్రజలు రాత్రి వేళల్లో అపరిచిత వ్యక్తుల కదలికలు కనిపించినా, అనుమానాస్పద పరిస్థితులు ఎదురైనా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని అధికారులు సూచిస్తున్నారు. ఇళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు, పరిసరాల్లో అప్రమత్తంగా ఉండాలని కోరుతున్నారు.

# మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో ఎస్ఎంసి ఎన్నికలు


ఎన్నికైన వారితో ప్రమాణస్వీకారం చేయిస్తున్న దృశ్యం


ఎన్నికైన వారిని సన్మానించిన దృశ్యం

చిలమత్తూరు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

చిలమత్తూరు మహాత్మాగాంధీ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో పాఠశాల నిర్వహణ కమిటీ (ఎస్ఎంసి) ఎన్నికలు మంగళవారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో ఎం.లక్ష్మీ (పాత చామలపల్లి) చైర్మన్‌గా, గిరిజమ్మ (చేనేపల్లి) వైస్ చైర్మన్‌గా ఎన్నికయ్యారు. వీరితో పాటు మొత్తం 20 మంది సభ్యులతో ఎస్ఎంసి కమిటీ ఏర్పాటు చేశారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల సంక్షేమం, మౌలిక వసతుల మెరుగుదల కోసం కమిటీ సమన్వయంతో పనిచేద్దామని చైర్మన్, వైస్ చైర్మన్ పేర్కొన్నారు. చైర్మన్ లక్ష్మీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ సహాయ సహకారాలతో పాఠశాలను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు సాయశక్తులా కృషి చేస్తామని వారు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియను ఎంఇఒ హనుమంతురెడ్డి. ప్రిన్సిపాల్ శోభారాణి, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రుల సమక్షంలో నిర్వహించారు.

# లేపాక్షి ఆలయాన్ని సందర్శించిన ప్రవచనకర్త గరికపాటి

**- ప్రత్యేక పూజలు నిర్వహించిన గరికపాటి**


లేపాక్షి ఆలయం సందర్శనకు వచ్చిన గరికపాటి నరసింహారావు


గరికపాటికి నంది విగ్రహం చిత్రపటం అందచేస్తున్న దృశ్యం

లేపాక్షి, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

ప్రముఖ ప్రవచనకర్త, పద్మశ్రీ, మహా సహస్రావధాని గరికపాటి నరసింహారావు మంగళవారం చారిత్రాత్మక లేపాక్షి శ్రీవీరభద్రస్వామి ఆలయాన్ని సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు స్థానిక నాయకులు, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పరిగి వేణుగోపాలరావు ఘన స్వాగతం పలికారు. అనంతరం దుర్గాదేవి, వీరభద్ర స్వాములకు గరికపాటి నరసింహారావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హిందూపురం శాసనసభ్యులు నందమూరి బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శులు వీరయ్య, బాలాజీలతో పాటు టీడీపీ మండల అధ్యక్షుడు అభిలాష్, జిల్లా అధికార ప్రతినిధి ఆనందకుమార్, తదితరులు పాల్గొని ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లను పర్యవేక్షించారు. అనంతరం వీరభద్ర అన్నదాన సేవా ట్రస్ట్ సభ్యులు ప్రవచనకర్త గరికపాటి నరసింహారావును ఘనంగా సత్కరించారు.

## మండల వ్యాప్తంగా 46 స్కూళ్లలో ఎస్ఎంసి ఎన్నికలు

**నాలుగు స్కూళ్లు పోస్ట్ పోన్**

బ్రహ్మసముద్రం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా ఉన్న 50 స్కూలులకు గాను మంగళవారం స్కూల్ కమిటీ ఎన్నికల్లో 46 స్కూళ్లలో స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారు స్కూల్ కమిటీ ఎన్నికల కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో ఎస్ఓ మహాలక్ష్మి అధ్యక్షతన స్కూల్ కమిటీ ఎన్నికలు నిర్వహించారు మండల వ్యాప్తంగా 50 స్కూల్లో గాను 46 పాఠశాలలు నిర్వహించి నూతన కమిటీని ఎన్నుకున్నారని మిగతా నాలుగు పాఠశాలలో ఎన్నికలు పోస్ట్ పోన్ అయ్యాయని ఎంఈఓ ఓబులపతి తెలిపారు.

# పెన్నహోబిళ క్షేత్రంలో సజావుగా బహిరంగ వేలాలు

**- బియ్యం బేడల వేలం ఖరారు, కొబ్బరి చిప్పల వేలం వాయిదా**


పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో జరిగిన బహిరంగ వేలం

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త

మండల పరిధిలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం పెన్నహోబిళం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం జరిగిన బహిరంగ వేలాలు సజావుగా కొనసాగాయి. దేవాదాయశాఖ పర్యవేక్షణ అధికారి కె.విజయకుమార్ పర్యవేక్షణలో ఆలయ కార్యనిర్వహణ అధికారి సాకే రమేష్‌బాబు, ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మెన్ రేగటి నాగరాజు, సభ్యుల ఆధ్వర్యంలో 2026-27 సంవత్సరానికిగాను కొబ్బరి చిప్పల సేకరణ హక్కు, కలగలుపు బియ్యం బేడలు విక్రయించుకొను హక్కు వేలం నిర్వహించారు. కలగలుపు బియ్యం బేడలు అమ్ముకొను హక్కుకు వేలం నిర్వహించగా నలుగురు డిపాజిట్లు కట్టి ఇద్దరు వేలంలో పాల్గొనగా అహోబిలానికి చెందిన పి.నాగశేషుడు కేజీ బియ్యం బేడలను 25.50 రూపాయలకు వేలం పాడగా ఖరారైంది. గత ఏడాది జరిగిన వేలం కంటే కేజీపై 4.50 రూపాయలు అధికంగా ఈ వేలం ఖరారైంది. కొబ్బరి చిప్పల సేకరణ వేలం జరుగగా ముగ్గురు డిపాజిట్లు కట్టగా పాట 5,70,000 రూపాయల వద్ద ఆగిపోయింది. సరైన పాట రాకపోవడంతో ఈ వేలం పాటను వాయిదా వేస్తున్నట్లు ఈవో ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు యం.రామకృష్ణ, చంద్రమౌళీస్వామి, మంగళి నారాయణప్ప, బొల్లినేని పద్మాక్షి, ధనుంజయ ఆచారి, టీడీపీ నాయకులు మోపిడి గోవిందు, ఇంద్రావతి సుధాకర్, బొల్లినేని ఓబులేష్, జనసేన నాయకుడు దేవేంద్ర, ఆలయ సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

# సాగునీరు అందదని 5 ఎకరాల్లో మిరప పంట తొలగింపు..!

**- మరో 5 ఎకరాల్లోకి గొర్రెలను వదిలేసిన కౌలు రైతు**
**- పెట్టుబడి దాదాపు 5 లక్షల రూపాయలకుపైగా నష్టం**


మిరప పొలంలోకి గొర్రెలను వదిలిన దృశ్యం


పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న దృశ్యం

ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త


కౌలు రైతు రంగనాయకులు

సాగు నీరు అందని పరిస్థితులు ఏర్పడటంతో 5 ఎకరాల్లో మిరప పంటను ట్రాక్టర్‌తో దున్నేయడంతోపాటు మరో 5 ఎకరాల్లోకి గొర్రెలను వదిలేశాడు కౌలు రైతు రంగనాయకులు. దాదాపు రెండు నెలలపాటు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చిన రైతు ఇకపై పంటలకు హంద్రీనీవా ద్వారా సాగునీరు అందని పరిస్థితులు ఏర్పడటంతో తీవ్ర మనోవేదనకు గురవుతూనే పంట తొలగించగా 5 లక్షల రూపాయలకు పైగా పెట్టుబడిని నష్టపోవాల్సి వచ్చింది. వివరాల్లోకి వెళితే... విడపనకల్లు మండలం వేల్పుమడుగు గ్రామానికి చెందిన రంగనాయకులు అనే రైతు ఉరవకొండ మండల పరిధిలోని చిన్నముష్టూరు గ్రామంవద్ద 10 ఎకరాలను కౌలుకు తీసుకొని హంద్రీనీవా కాలువ కింద మిరప పంటను సాగు చేశాడు. అయితే పంట ఎదుగుతున్న సమయంలో హంద్రీనీవా కాలువ ద్వారా నీరు అందని పరిస్థితులు ఏర్పడటంతోపాటు వర్షాల జాడలేకపోవడంతో పంట ఎదుగుదలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో చేసేదేమీ లేక రైతు రంగనాయకులు పంటలను గొర్రెలకు వదిలేయడంతోపాటు ట్రాక్టర్‌తో తానే దున్నేయడం విశేషం. ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవడంతోపాటు ప్రత్యామ్నాయ విత్తనాలను ఉచితంగా అందించాలని కోరుతున్నాడు.

04ATP13_04ATP13.qxd 29-09-2026 PM 10:15 Page 1



# కళ్యాణదుర్గం అభివృద్ధిలో న్యాయవాదులు భాగస్వాములు కావాలి

**సబ్ కోర్టు ఏర్పాటుకు ముఖ్యమంత్రిని కలిసి విన్నవిస్తాం: ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు**

**బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు ఘన సన్మానం**




న్యాయవాదులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే , ఎమ్మెల్యేను సన్మానిస్తున్న న్యాయవాదులు

**కళ్యాణదుర్గం, సెప్టెంబర్ 29 (ప్రభాతవార్త):** కళ్యాణదుర్గం ప్రాంతం ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ప్రాంతమని, ప్రజల సమస్యలను పరిష్కరించడంతో పాటు నియోజకవర్గ అభివృద్ధికి న్యాయవాదులు కూడా తమ వంతు సహకారం అందించాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు కోరారు. ప్రజా సమస్యల పరిష్కారంలో న్యాయవాదులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తే మరింత అభివృద్ధిసాధ్యమవుతుందనిఆయనపేర్కొన్నారు. కళ్యాణదుర్గం పట్టణానికి రెండు అదనపు కోర్టులు మంజూరు కావడంతో బార్అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కోర్టుల మంజూరుకు సహకరించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఇప్పటికే మంజూరైన రెండు కోర్టుల్లో కార్యకలాపాలు ప్రారంభమయ్యాయని, న్యాయవ్యవస్థను ప్రజలకు మరింత చేరువ చేసే దిశగా ఇది ముఖ్యమైన అడుగని అన్నారు. బీటీపీని పూర్తి చేసి సుమారు 140 చెరువులకు నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ ప్రాజెక్టును హార్టికల్చర్ నిధులతో చేపట్టేలా చర్యలు తీసుకున్నామని, అక్టోబర్ 2న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, వ్యవసాయ శాఖమంత్రి సమక్షంలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇప్పటివరకు సుమారు 30 శాతం మేర అభివృద్ధి జరిగిందని, ఇంకా 70 శాతం మేర అభివృద్ధి చేయాల్సి ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజక వర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు ఆరు నుంచి ఎనిమిది సంవత్సరాల వరకు సమయం పట్టే అవకాశం ఉందని, దశలవారీగా అవసరమైన పనులను పూర్తి చేస్తామని చెప్పారు. సాయిబాబా ఆలయం సమీపంలోని డ్రైనేజీని వెడల్పు చేయడంతో పాటు అక్కమ్మ ఆలయం నుంచి కుందుర్పి రోడ్డు వరకు, టీ సర్కిల్ నుంచి దొడగట్ట బైపాస్ వరకు రహదారుల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపినట్లు చెప్పారు. కళ్యాణదుర్గంలో సబ్ కోర్టు ఏర్పాటు చేయాలనే న్యాయవాదుల ఆకాంక్షను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు తాను సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. బార్ అసోసియేషన్ ప్రతినిధుల ద్వారా ముఖ్యమంత్రిని కలిసి సబ్ కోర్టు ఏర్పాటుపై విన్నవిస్తామని తెలిపారు. వ్యవసాయ రంగం, సాగునీరు, రహదారులు, డ్రైనేజీ, న్యాయవ్యవస్థ వంటి అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధించేందుకు ప్రజలతో పాటు న్యాయవాదులు కూడా భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు పిలుపునిచ్చారు.

# జిల్లాలో పండ్లతోటల ఉత్పత్తి నాణ్యతను పెంచి రాయలసీమను గ్లోబల్ హబ్‌గా తయారుచేస్తాం

**- వెనుకబడిన అనంతపురం జిల్లాను అభివృద్ధి బాటలో నడిపిస్తాం ఎంపి అంబికా లక్ష్మినారాయణ**




సమావేశంలో మాట్లడుతున్న ఎంపి అంబికా లక్ష్మినారాయణ,సమావేశానికి హాజరైయిన వ్యవసాయశాఖ అదికారులు శాస్త్రవేత్తలు

**బుక్కరాయసముద్రం సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

జిల్లాలో పండ్లతోటలను ఉత్పత్తిని పెంచి రాయలసీమను గ్లోబల్ హబ్‌గా తయారుచేసి,వెనుకబడిన అనంతపురం జిల్లాను అభివీద్ధి బాటలో నడిస్తామని అనంతపురం ఎంపి అంబికాలక్ష్మీనారాయణ అన్నారు. మంగళవారం బుక్కరాయసముద్రం మండల పరిదిలోని ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రేకులకుంటలో ఏ.ఆర్.ఎస్ రేకులకుంటలో ఘనంగా అగ్రి ఎక్స్పోకిస్సాన్‌కిసాన్ మేళానిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపితోపాటు ఎమ్మెల్సీ దలవాయి రమాదేవి, మార్కెట్ కమిటి చైర్పర్సన్ బల్ల పల్లవి,ఇతర ప్రజాప్రతినిధులు వ్యవసాయ అనుబంధల శాకల జిల్లా అధికారులు,అనంతపురం జిల్లావ్యవసాయశాఖ సిబ్బంది, ఏఆర్ఎస్ రేకులకుంట,కెవికె రెడ్డిపల్లి,కెవికె కళ్యాణదుర్గం శాస్త్రవేత్తలు,రైతులు పాల్గొన్నారు.ఈ సందర్భంగ ఎంపి అంబికా లక్ష్మినారాయణ మాట్లడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వం మదనపల్లిలో ఇండియన్ స్కూల్ఆఫ్ అగ్రి ఏర్పాటు చేస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆలోచన మేరకు ఆంధ్రప్రదేశ్‌లో అక్టోబర్ 2 తేదిన మదనపల్లిలో పబ్లిక్ ప్రవేట్ పార్టనర్షిఫ్‌తో లక్ష కోట్ల రూపాయలకార్పస్ ఫండ్‌తో రాయలసీమను ఇంటిగ్రేటెడ్ హార్టికల్చర్‌హబ్‌గా శంకుస్థాపన కార్యక్రమాన్ని చేస్తామన్నారు.కరువు వెనుకబడిన అనంతపురం జిల్లాను అభివృద్ధిబాటలో నడిపించడానికి కేంద్ర ప్రభుత్వం నుండి ప్రధానమంత్రి ధనధాన్యకృషియోజనకింద నిధులు మంజూరుచేసి జిల్లాలో అధికసంఖ్యలో సీతల గిడ్డంగులు ఏర్పాటుకు కృషిచేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారిసాలురెడ్డి, ఏపిఎంఐపిపిడి రఘునాథ్‌రెడ్డి,ఆత్మపిడి విద్యావతి,సిల్లా పశువర్దకశాఖ జెడి ప్రేమ్చంద్,సీటీఐఓ లక్ష్మినాయక్, ఎంపిడివో సాల్మన్‌రాజ్, మండలవ్యవసాయాదికారి శ్యామ్‌సుందర్‌రెడ్డి, ఉద్యానశాఖఅధికారి శైలజ,తోపాటు ఆయాశాకల అధికారులు, వాస్త్రవేత్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఖాద్రి వడ్డెర్ల సంక్షేమ సంఘం కళ్యాణ మండపం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయండి



వడ్డెర సంఘం కళ్యాణ మండపం పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్

**కదిరి, సెప్టెంబర్29 ప్రభాతవార్త**

పట్టణంలోని ఖాద్రి వడ్డెర్ల సంక్షేమ సంగం కమ్యునిటీ కళ్యాణ మండం నిర్మాణ పనుల పురోగతిపై స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిర్మాణపు పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలతోపాటు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కళ్యాణ మండపం అందుబాటులోకి తీసుకొస్తే ఖాద్రి సంక్షేమ వడ్డెర్ల సంఘ సభ్యుల వివాహాలకు ఇతర సామాజిక కార్యక్రమాలు నిర్వహించడానికి ఎంతో ఉపయోగపడుతుందని, యఉద్ద ప్రాతిపదికన పూర్తి చేయాలన్నారు. కళ్యాణ మండపంలో నాణ్యతతో కూడటంతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఖాద్రి వడ్డెర్ల సంఘం నాయకులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

# ప్రతి పల్లెను ప్రగతి బాటలో నడిపిస్తాం..!!

**- పల్లె పండుగ 3.0లో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం**




సిసి రోడ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే, గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

**గుంతకల్లు, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

ప్రతి పల్లెను ప్రగతి బాటలో నడిపిస్తామని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని దంచర్ల గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ 3.0 కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో రోడ్లు, డ్రైనేజీలతో పాటు దేవాలయ అభివృద్ధికి కూడా నిధులు కేటాయించామన్నారు. గత ప్రభుత్వం గ్రామాలను విస్మరిస్తే నేడు కూటమి ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలో సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, మినీ గోకులాలు, బస్సు సెంటర్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం బాగుంటుందని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్రవ్యాప్తంగా 11.85 వేల కోట్ల నిధులు మౌళిక వసతుల అభివృద్ధికి కేటాయించారని కొనియాడారు. పార్టీలకు అతీతంగా ప్రజలు అభివృద్ధి పనులకు సహకరించాలని కోరారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి తగాదాలకు వెళ్లకుండా పార్టీ గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ రామన్నచౌదరి, నాయకులు యుగంధర్‌చౌదరి, అధికారులు, గ్రామ పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.

# 'ప్రజా దర్బార్'కు వినతుల వెల్లువ

**-ఓపిగ్గా సమస్యలు విన్న ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్**



వినతిపత్రాలు స్వీకరిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

**ఉరవకొండ, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

జిల్లాకేంద్రం అనంతపురంలోని రాంనగర్‌కాలనీలోని తనక్యాంపు కార్యాలయంలో మంగళవారం రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ నిర్వహించిన ప్రజా దర్బార్‌కు విశేష స్పందన కనిపించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి మంత్రికు సమస్యలు వివరించి వినతిపత్రాలు సమరి ్పంచారు. మంత్రి ప్రతి సమస్యను ఓపిగ్గా విని వినతులు స్వీకరించారు. సమస్యలను సానుకూలంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు.

**నేడు ఉరవకొండకు రానున్న మంత్రి:** రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ బుధవారం ఉరవకొండకు వస్తున్నారని తెలుగుదేశం పార్టీ వర్గాలు తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మంత్రి తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# రోడ్డు ప్రమాద నివారణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టండి

**ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి**

**జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్,జిల్లా ఎస్పీ సతీష్ కుమార్**



అధికారులకు సూచనలు ఇస్తున్న జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు , హాజరైన సంబంధిత శాఖల అధికారులు

**శ్రీ సత్యసాయి జిల్లా, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త ప్రతినిధి**

జిల్లావ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల నివారణకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధికారులను జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ లు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నందు జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ అధ్యక్షతన జిల్లా రోడ్ సేఫ్టీ కమిటీ సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణ, ప్రమాదకర ప్రాంతాల గుర్తింపు, రహదారి భద్రతా చర్యలు, స్కూల్ జోన్లలో భద్రత, ద్విచక్ర వాహనదారుల హెల్మెట్ వినియోగం, ఈ-డి ఏ ఆర్ అమలు తదితర అంశాలపై విస్తృతంగా సమీక్ష నిర్వహించారు. గత ఖిజిల్లా రోడ్ సేఫ్టీ కమిటీఖి సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు పురోగతిని శాఖల వారీగా సమీక్షించారు. ప్రమాద అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి, అవసరమైన స్పీడ్ బ్రేకర్లు, హెచ్చరిక బోర్డులు, రోడ్ మార్కింగ్స్ తదితర భద్రతా చర్యలు చేపట్టాలని పంచాయతీ రాజ్ శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల సమీపంలో సుమారు 306 ప్రాంతాల్లో రోడ్ సైన్స్లు, స్పీడ్ బ్రేకర్లు, రోడ్ మార్కింగ్స్ తదితర భద్రతా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని జిల్లా విద్యాశాఖ అధికారి సమావేశంలో వివరించారు.ప్రమాదం ఎలా జరిగింది, ప్రమాద తీవ్రత ఎంత, ప్రమాదానికి దారితీసిన ప్రధాన కారణాలు ఏమిటి అనే అంశాలపై సమగ్రంగా, శాస్త్రీయంగా విచారణ జరగాలని జిల్లా ఎస్పీ సూచించారు. ప్రతి 40 కిలోమీటర్లకు పెట్రోలింగ్ వాహనాలను ఏర్పాటు చేసి, వాటి ద్వారా నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తున్నట్లు ఎన్ హెచ్ ఏ ఐ అధికారి శ్రావణ్ కుమార్ తెలిపారు. అలాగే ఎన్ హెచ్44పై సోమందేపల్లి, కోడికొండ ప్రాంతాల్లో అంబులెన్స్ , పెట్రోలింగ్ వాహనాల ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ఉన్నట్లు వివరించారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టాన్ని మరింత తగ్గించేందుకు పోలీస్, రవాణా, ఆర్అండ్‌బి, ఎన్‌హెచ్ఎఐ, పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖలు మరియు ఇతర సంబంధిత శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ , జిల్లా ఎస్పీ సూచించారు. ఈ సమావేశంలో పోలీస్, రవాణా, ఎన్‌హెచ్ఎఐ, ఆర్అండ్‌బి పంచాయతీ రాజ్, వైద్య ఆరోగ్య, విద్యాశాఖ, ఈడి ఏఆర్‌తోపాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# గుండెను కాపాడుకుందాం.. ఆరోగ్యంగా జీవిద్దాం!..

**- హృదయ ఆరోగ్యంపై..అవగాహనకు ..కిమ్స్ సవీర 2కె రన్..**




కిమ్స్ సవీర 2కె రన్ నిర్వహిస్తున్న దృశ్యం

**అనంతపురం, సెప్టెంబర్29 ప్రభాతవార్త బ్యూరో**

గుండె ఆరోగ్యంపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించేందుకు కిమ్స్ సవీర హాస్పిటల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ హృదయ దినోత్సవాన్ని పురస్కరించుకుని 2కె రన్‌ను మంగళవారం పెద్ద ఎత్తున నిర్వహించారు. టవర్ క్లాక్ సర్కిల్ టు సప్తగిరి సర్కిల్ తిరిగి టవర్ క్లాక్ సర్కిల్ వరకు సాగిన ఈ రన్‌లో వైద్యులు, వైద్య సిబ్బంది, యువత, ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కిమ్స్ సవీర హాస్పిటల్ సీనియర్ కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ మూడే సందీప్, ఐఎంఏ అనంతపురం వైస్ ప్రెసిడెంట్ డా.రావి, శ్రీనివాసులు మాట్లాడుతూ.. గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి చిన్న వయసు నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను పాటించడం అవసరమన్నారు. నేటిజీవనశైలిలో శారీరకశ్రమతగ్గడం, అధికఒత్తిడి, అనారోగ్యకరమైన ఆహారపుఅలవాట్లు గుండెఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయని తెలిపారు. రోజూ కొంత సమయం వ్యాయామానికి కేటాయించడం, సమతుల్య ఆహారం తీసుకోవడం, పొగతాగడం, పొగాకుఉత్పత్తులకు దూరంగా ఉండటం ద్వారా గుండెజబ్బుల ముప్పునుతగ్గించుకోవచ్చని సూచించారు. కన్సల్టెంట్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పర్వేజ్ నవాజ్ మాట్లాడుతూ గుండె ఆరోగ్యంపై అవగాహన కల్పించడం ఒక్కరోజుకే పరిమితం కాకూడదు. ప్రతి రోజూ మన జీవనశైలిలో ఆరోగ్యకరమైన మార్పులుచేసుకోవాలి.కన్సల్టెంట్ కార్డియోథొరాసిక్ సర్జన్ డా.పవన్ మాట్లాడుతూ.. గుండెను ఆరోగ్యంగా ఉంచుకోవాలంటే వ్యాయామం మనరోజువారీ జీవితంలో భాగంకావాలి. 2కెరన్ వంటి కార్యక్రమాలు ప్రజల్లోఆరోగ్యంపై అవగాహనపెంచడంతోపాటు శారీరక చురుకుదనంపై ఆసక్తినికలిగిస్తాయి. కుటుంబంలోగుండెజబ్బుల చరిత్రఉన్నవారు, మధుమేహం, అధికరక్తపోటు, కొలెస్ట్రాల్ ఉన్నవారు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలుచేయించుకోవాలి. గుండెపోటు లక్షణాలను ముందుగాగుర్తించి సకాలంలో చికిత్సపొందితే ప్రాణాలనుకాపాడే అవకాశం ఉంటుంది" కార్డియాలజీ విభాగం వైద్యులు అన్నారు. ఈ సందర్భంగా గుండె కోసం పరుగు ఆరోగ్యం కోసం అడుగు" అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కార్యక్రమంలో కిమ్స్ సవీర హాస్పిటల్ వైద్యులు, డా.రాజేష్, ఆపరేషన్స్ డీజీఎం డా.ధీరజ్, మార్కెటింగ్ జీఎం ప్రభాకర్, నర్సింగ్‌సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# గోవుల సంరక్షణ కోసమే మినీ గోకులాలు

**పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.॥.33 కోట్లతో 529 మినీ గోకులాలు మంజూరు**

**మినీ గోకులాలకు భూమి పూజ చేసిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె**



పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీమంత్రి

**పుట్టపర్తి టౌన్, సెప్టెంబర్ 29, ప్రభాతవార్త**

పశుసంపదను సంరక్షిస్తూ రైతులకు అదనపు ఆదాయంకల్పించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం మినీ గోకులాల నిర్మాణానికి శ్రీకారం చుట్టిందని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లెసింధూరరెడ్డి, మాజీ మంత్రి పల్లెరఘునాథ్‌రెడ్డితెలిపారు. పుట్టపర్తి నియోజకవర్గంలో రూ.11.33 కోట్ల వ్యయంతో 529 మినీ గోకులాలు మంజూరయ్యాయని వారు వెల్లడించారు. ఇందులో భాగంగా పుట్టపర్తి మండలంలోని బత్తలపల్లిలో రైతుఎల్లయ్య,పెడబల్లిలో రైతు దాసరి ఆంజనేయులు, కోట్లపల్లిలో రైతు రామసుబ్బారెడ్డి, నిడిమామిడిలో రైతుహరి నిర్మించనున్న మినీ గోకులాలకు మంగళవారం ఎమ్మెల్యే, మాజీ మంత్రి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతులు తమ పశువులను వర్షాలు, ఎండలు, ఇతర వాతావరణ పరిస్థితుల నుంచి రక్షించుకునేందుకు మినీ గోకులాలు ఎంతో ఉపయోగపడతాయని అన్నారు. పశువుల సంరక్షణకు అవసరమైన సదుపాయాలను కల్పించడం ద్వారా రైతులకు ఆర్థిక భారం తగ్గించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమనితెలిపారు. రైతుల సంక్షేమం, పశుసంవర్ధకరంగ అభివృద్ధికి ప్రభుత్వంప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు.మినీ గోకులాలను రైతులు సద్వినియోగం చేసుకుని పశువులను ఆరోగ్యంగా సంరక్షించుకోవాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మండల కన్వీనర్ విజయ కుమార్, టీడీపీ మాజీ జెడ్పీటీసీ శ్రీరామ్ నాయక్ , బొమ్మయ్య,నాయకులు నాగరాజు ,టీడీపీ నాయకులు కార్యకర్తలు, అధికారులు ఏపిడి రమేష్ బాబు, ఏపీఓ వరప్రసాద్ రైతులు పాల్గొన్నారు.

# జెన్ ఆల్ఫా క్రీడాకారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడం అభినందనీయం

**-క్రీడా రంగాన్ని ప్రోత్సహించడంలో ఆర్డీటి ఎప్పుడూ ముందుంటుంది**

**-ఆర్డీటి క్రికెట్ టాలెంట్ హంట్ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి**



మాట్లాడుతున్న జె.సి ప్రభాకర్‌రెడ్డి



కార్యక్రమంలో పాల్గొన్న క్రీడాకారులు

**తాడిపత్రిఅర్బన్, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త**

తాడిపత్రిలో ఆర్డీటి డైరెక్టర్ మాంచో ఫెర్రర్ ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా క్రికెట్ క్రీడాకారుల అన్వేషణలో భాగంగా క్రికెట్ టాలెంట్ హంట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి అధ్యక్షతన తాడిపత్రి జూనియర్ కళాశాలలో మంగళవారం జరిగిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జె.సి ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జెన్ ఆల్ఫా (18 సంవత్సరాల్లోపు యువకులు) క్రీడాకారులు పెద్దఎత్తున పాల్గొనడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఒలంపిక్స్, ఆసియా గేమ్స్‌లో మన భారతదేశం పేలవమైన ప్రదర్శన తనను ఎంతగానో బాధిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్డీటి సంస్థ తరహాలో దేశవ్యాప్తంగా స్వచ్ఛంద సంస్థలు ముందుకువచ్చి క్రీడారంగానికి తగినప్రోత్సాహం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని జె.సి ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఆర్డీటి క్రికెట్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ మచ్చా రామలింగారెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ క్రీడాకారుడైన జె.సి ప్రభాకర్‌రెడ్డి జిల్లాలో క్రీడాభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తుండడం అభినందనీయమన్నారు. ఎమ్మెల్యే జె.సి అశ్మిత్‌రెడ్డి, జె.సి పవన్‌రెడ్డిలతో తనకు చిరకాలంగా మంచి సంబంధాలు ఉన్నాయని క్రీడాకారులకు వివరించారు. ఫెర్రర్ తనపై ఉంచిన బృహత్తర బాధ్యతను శక్తి వంచన లేకుండా విజయవంతం చేయడానికి ప్రయత్నిస్తున్నానని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. సీనియర్ క్రికెట్ క్రీడాకారులు కందన్ తనవంతుగా క్రీడాకారులకు చల్లటి తాగునీటిని అందించారు.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా లేని విధంగా ఆర్డీటి క్రికెట్ టాలెంట్ హంట్‌ను విజయవంతం చేసిన తాడిపత్రి ఇన్‌చార్జ్ కృష్ణారెడ్డిని పలువురు అభినందించారు. ఏకంగా 300 మంది క్రీడాకారులు టాలెంట్ హంట్‌లో పాల్గొనడం విశేషం. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ చైర్మన్ రహీం, సీనియర్ క్రీడాకారులు సుధీర్‌రెడ్డి, సాయివినయ్, పీఈటి హాజీవలి, కుళ్లాయప్పలతో పాటు పెద్ద సంఖ్యలో సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

# పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో యువతుల కోసం పీసీఓడీ అవగాహన కార్యక్రమం



కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ బండి రమేష్‌బాబు

**అనంతపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో**

పాలీసిస్టిక్ ఓవరీ డిసీజ్ (పీసీఓడీ)పై యువతులలో అవగాహన కల్పించడం, ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులను ప్రోత్సహించడం అనే లక్ష్యంతో పీవీకేకే ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని మహిళా సాధికారత విభాగం యువతుల కోసం ఒక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మొదటిగా మహిళా సాధికారత విభాగం కన్వీనర్ వై. మమత మాట్లాడుతూ.. పిసిఒడి పైన విద్యార్థులు తీసుకోవలసినటువంటి జాగ్రత్తలను వివరిస్తూ, పీసీఓడీకి గల కారణాలు, లక్షణాలు, నివారణ చర్యలు, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, శారీరక శ్రమ, ఒత్తిడి నిర్వహణ, సకాలంలో వైద్యుడిని సంప్రదించడం యొక్క ప్రాముఖ్యత వంటి ముఖ్యమైన అంశాలను వివరించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అనంతపురంలోని శ్రీకర హాస్పిటల్స్ గైనకాలజిస్ట్ ఫెర్టిలిటీ స్పెషలిస్ట్ డాక్టర్ చిత్రా శ్రీ లక్ష్మితో మాట్లాడి, పీసీఓడీ, మహిళల ఆరోగ్యానికి సంబంధించిన వివిధ అంశాలపై స్పష్టత కోరారు. ఈ కార్యక్రమం విలువైన సమాచారాన్ని అందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలి పద్ధతులను అలవర్చుకోవడానికి విద్యార్థులను ప్రోత్సహించారు. యాజమాన్యం, ప్రిన్సిపాల్ డాక్టర్ బండి రమేష్ బాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.దీప్తి జోర్ధన, పరిపాలనా అధికారి డాక్టర్ కె.మనోహర్ రెడ్డి పాల్గొని, విద్యార్థులలో ఆరోగ్యం, శ్రేయస్సును ప్రోత్సహించడానికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించిన మహిళా సాధికారత సెల్ యొక్క ప్రయత్నాలను అభినందించారు.

# అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా వామపక్షాల ర్యాలీలు

**- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు**




మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసులు , హాజరైన కార్యకర్తలు

**అనంతపురం, సెప్టెంబర్ 29 ప్రభాతవార్త బ్యూరో**

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుంచి తొలగించాలని సీపీఎం రాష్ట్రకార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఎన్నికల సంస్కరణలు, ఎన్నికల వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలపై మంగళవారం అనంతపురంలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో రామ్‌రెడ్డి అధ్యక్షతన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా వి.శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. ఓటర్లజాబితా పునర్విజన్ పేరుతో అర్హులైన ఓటర్ల పేర్లను తొలగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయని ఆయన అన్నారు. ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలకు చెందిన ఓటర్లు, సానుభూతిపరులను లక్ష్యంగా చేసుకుని పేర్లు తొలగిస్తున్నారనే ఆరోపణలపై ఎన్నికల కమిషన్ స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. జ్ఞానేష్ కుమార్ గతంలో కేరళలో పనిచేసిన సమయంలో ఎదురైన అవినీతి ఆరోపణలు, విజిలెన్స్ విచారణ అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు. కేరళలోని ఆయన గత పరిపాలనా వ్యవహారాలకు సంబంధించిన ఆరోపణలు ఇటీవల మళ్లీ చర్చకు వచ్చినట్లు వార్తా నివేదికలు పేర్కొంటున్నాయన్నారు. ఎన్నికల కమిషన్ స్వతంత్రతను, ఓటు హక్కును, ఓటర్ల జాబితాల పారదర్శకతను కాపాడేందుకు అక్టోబర్ 2న రాష్ట్రవ్యాప్తంగా వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించాలని వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్యవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొని ర్యాలీలను విజయవంతం చేయాలని కోరారు. ప్రజల ఓటు హక్కును పరిరక్షించడం, ఎన్నికల ప్రక్రియలో పారదర్శకత తీసుకురావడం, ఎన్నికల కమిషన్ స్వతంత్రతను కాపాడటం కోసం ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఎన్నికల వ్యవస్థపై వచ్చే ఆరోపణలు, అభ్యంతరాలపై ఎన్నికల కమిషన్ సమగ్రంగా స్పందించి ప్రజలకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో తమ పేర్లు ఉన్నాయో లేదో ప్రతి ఒక్కరూ పరిశీలించుకోవాలని, ఏవైనా తప్పులు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డాక్టర్ గేయానంద్, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకుడు యేసు రత్నం, సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేంద్ర కుమార్, బాల రంగయ్య, కృష్ణమూర్తి, చంద్రశేఖర్ రెడ్డి, బి.శ్రీనివాసులు, ఆర్.వి.నాయుడు, ముత్తుజ, రామాంజనేయులు, భాస్కర్, పరమేష్, అచ్యుత్ ప్రసాద్, నిర్మల తదితరులు పాల్గొన్నారు.